క్లుప్తంగా

పట్టణాభివృద్ధిపై చర్చ



మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణిని కలుసుకున్న కమిషనర్ నిర్మల్‌కుమార్

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వి.నిర్మల్‌కుమార్ మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పట్టణాభివృద్ధి, మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాలపై చర్చించుకున్నారు. సమన్వయంతో పట్టణాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుదామని కమిషనర్ అన్నారు. చైర్‌పర్సన్ చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణికి కమిషనర్ నిర్మల్‌కుమార్ పుష్ప గుచ్ఛం అందించి పరిచయం చేసుకున్నారు.

మండల వ్యవసాయ అధికారిగా ప్రవీణ్



అమలాపురం రూరల్: స్థానిక మండల వ్యవసాయఅధికారిగా కె.ప్రవీణ్ బాధ్యతలు చేపట్టారు. కాట్రేనికోన ఏవోగా పని చేస్తూ ప్రవీణ్ అమలాపురం బదిలీపై వచ్చారు. ప్రస్తుతం అమలాపురం ఏవోగా పని చేసిన కడలి ధర్మ ప్రసాద్ అంబాజీపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మంగళవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రవీణ్‌ను రైతులు, ఉద్యోగులు కలసి అభినందించారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లను అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

ఉప్పలగుప్తం: భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యార్థి మిత్ర కిట్లను జెడ్పీటీసీ గెద్దం సంపదరావు మంగళవారం అందించారు. పాఠశాల హెచ్‌ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సంపదరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు, సర్పంచ్ జున్నూరి వెంకటేశ్వరరావు, అద్దంకి అమరేశ్వరరావు, ఉపాధ్యాయులు అరవ స్వామి, నడింపల్లి పద్మనాభన్, వేటూరి వెంకటేశ్వరరావు, కామన మధుసూదనరావు, కరాటం ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుని సంబరం

తాళ్లరేవు: పి.మల్లవరంలో వీరభద్రుని సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బాదరాల శ్రీనివాసరావు, కౌసల్య దంపతులచే వీరభద్రునికి విశేష పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి పోలేకుర్రు కాలువలో పవిత్ర స్నానాలాచరించారు. వీరముష్టుల నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో స్వామివారి సంబరాన్ని వైభవంగా చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి బదిలీలు

ముమ్మిడివరం: సమగ్ర శిక్షా పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి. సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఆదేశాల మేరకు రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలు నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి మమ్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఐఈఆర్‌పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్‌లు, సీఆర్‌ఎంటీలు, మండల లెవిల్ అకౌంటెంట్లు, సైట్ ఇంజినీర్లు, , డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేట్‌లకు బదిలీలు ఉంటాయన్నారు. ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు బదిలీలకు జిల్లా స్థాయిలో దరఖాస్తులు స్వీకరిస్తారని, 23న సీనియార్టీ జాబితా ప్రదర్శన, 27 వరకు బదిలీల దరఖాస్తులపై అభ్యంతరాలు ఉంటాయన్నారు. 28న కౌన్సిలింగ్ నిర్వహించి ఉత్తర్వులు ఇస్తారన్నారు. బదిలీలపై అభ్యంతరాలుంటే జూలై 5న రాష్ట్ర కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

యానాం: పట్టణ పరిధిలో సుభద్రనగర్‌కు చెందిన బొండపల్లి దివాకర్(65) అనే వ్యక్తి అదృశ్యంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పునీత్‌రాజ్ తెలిపారు. ఈనెల 17వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన తర్వాత మళ్లీ రాలేదని దీంతో యానాం పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదన్నారు. ఆయన కుమారులు బొండపల్లి సతీష్, నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దివాకర్ కార్పెంటర్‌గా పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడని, భార్య నాగమణి ఆరు నెలల క్రితం మరణించడంతో తీవ్ర మనోవేదనకు గురై ఉంటూ ఇంటినుంచి వెళ్లిపోయినట్లు చెబుతున్నారని తెలిపారు.

ఖరీఫ్ వర్రీ

- కరుణించని వరుణుడు
- కలిసిరాని వాతావరణం
- అందని సాగునీరు
- అడుగు ముందుకేయని రైతన్న

ముమ్మిడివరం: ప్రకృతి కరుణించలేదు. వాతావరణం కలిసిరావడం లేదు. ప్రభుత్వం సహకరించడం లేదు. నానాటికీ పెరుగుతున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలతో ఖరీఫ్ సాగు చేసేందుకు రైతన్నలు భయపడుతున్నారు. జూన్ మూడో వారం వచ్చినా వర్షాలు కురవకపోవడంతో రైతులన్న వ్యవసాయ పనులు మొదలు పెట్ట లేదు. కాలువల నుంచి సాగు నీరు అందుతుందో లేదోనని ఆందోళన చెందుతు న్నారు. నారు మడులు వేసేందుకు అన్ని సిద్ధంగా ఉన్నా ఎండల తీవ్రత వారిని భయపెడుతోంది. సాగునీరు విడుదల చేసినా కాలువల చివరి ఆయకట్టుకు ఇంకా రావడంలేదు. రోహిణి, మృగశిర కార్తులు పూర్తయినా రుతుపవనాలు రాకపోవడం వాతావరణం చల్లబడకపోవడంతో నారుమళ్లు వేసేందుకు వారు సాహసించలేకపోతున్నారు. వారం క్రితం కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడినా మళ్లీ ఎండలు మండిపోతున్నాయి. దీంతో నారుమడులు ఎక్కడ ఎండిపోతాయోనని రైతులు సాగు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఆరుద్ర కార్తె సమీపిస్తున్న ఇంకా నియోజకవర్గంలో వర్షం పడకపోగా తీవ్రమైన ఉష్ణోగ్రతలతో వాతవరణం వేడెక్కుతోంది. దీంతో నారు వేస్తే నారు మడులు ఎండిపోతాయని రైతులు అంటున్నారు. సహజంగా జూన్‌నెలలో సాధారణ వర్షపాతం 124 మిల్లీ మీటర్లు కాగా 10 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైన దాఖలాలు లేవు. దీంతో ప్రతికూల వాతావరణంతో ఖరీఫ్ సాగు ఆలస్యమవుతోంది. ముమ్మిడివరం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 30.339 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతుందని అధికారులు అంచనా ఇప్పటివరకు నారు మడి దమ్ములు చేసినా దాఖలాలు లేవు.

స్పష్టత లేని అన్నదాత సుఖీభవ

అన్న దాత సుఖీభవ స్పష్టత లేకపోవడంతో రైతులు డోలాయమానంలోపడుతున్నారు. వరుస పంట నష్టాలతో కుదేలైన రైతులు బ్యాంకుల్లో రుణాలు పొంది సాగు చేశారు. రైతులకు ఆర్థిక భరోసా ఇస్తామన్న కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్న ఇంకా ఇవ్వలేదు. ఖరీఫ్ సాగుచేయాలంటే కొత్త రుణాలు పొందాల్సి ఉంటుంది. ఏటేటా పెట్టుబడులు పెరుగుతున్నాయి. గత ఖరీఫ్‌లో ఎకరాకు రూ.20వేలు ఖర్చు అయితే ఈఏడాది రూ.25 వేలు వరకు పెట్టుబడులు అవసరం ఉంటుందని అంచనా.

ముందుకు రాని కౌలు రైతు

ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట చేతికి రావడం లేదని కౌలు రైతులు ముందుకు రావడంలేదు. పెట్టుబడులకు తగ్గట్టుగా ఆదాయం రాకపోవడంతో రైతులకు మగతా ఇచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు.



ముమ్మిడివరంలో నారుమడులు వేసేందుకు సిద్ధమవుతున్న రైతు

కౌలు చేయడం కంటే కూలికి వెళ్లడం నయం



కౌలు వ్యవసాయం చేసే కంటే కూలికి వెల్లడం మంచింది. పెట్టుబడులు విపరీతంగా పెరుగు పోతున్నాయి. దీనికి తోడు వాతవరణం అకుకూలించక దిగుబుడులు తగ్గిపోతుంది. గిట్టుబాటు ధర దక్కడం లేదు. రైతులకు మగతా ఇచ్చేందుకు కూడా సరిపోవడంలేదు.

–పెయ్యల శ్రీనివాసరావు, కౌలు రైతు, గాడిలంక

పెట్టుబడి సాయం అందించాలి



గత రబీసీజన్‌లో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. దిగుబడులు అంతంత మాత్రంగానేఉన్నాయి. అయినా గిట్టుబాటు ధర లేక పెట్టుబడులుకూడా రాని పరిస్థితి. ఇప్పుడు ఖరీఫ్ సాగు చేయాలంటేనే కష్టంగా ఉంది. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలి

– కర్రి సత్యనారాయణ, రైతు, కర్రివానిరేవు

ముగిసిన ఉచిత వేసవి ‘వెయిట్ లిఫ్టింగ్’ శిక్షణ శిబిరం



పతకాలు, ధ్రువీకరణ పత్రాలతో క్రీడాకారులు. చిత్రంలో జిమ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో గత నెల రోజులుగా 50 మంది ఔత్సాహిక క్రీడాకారులకు ఇస్తున్న ఉచిత వేసవి వెయిట్ లిఫ్టింగ్ క్రీడా శిక్షణ శిబిరం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు 50 మంది క్రీడాకారులకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా జిమ్‌లో నిర్వహించిన అచీవ్‌మెంట్ టోర్నమెంట్‌లో విజేతలకు స్పోర్ట్స్ కిట్లు, పతకాలు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిమ్ ప్రతినిధి గారపాటి చంద్రశేఖర్ పర్యవేక్షణలో శిక్షణ సాగింది. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పప్పుల శ్రీరామచంద్రమూర్తి, వెయిట్ లిఫ్టింగ్ అభిమానులు, ప్రోత్సాహకులు అల్లాడ వెంకటరమణ, నమ్మిన వీరబాబు, పెద్దిరెడ్డి రాము, పొనకల దుర్గా ప్రసాద్, కోచ్ ఎంవీ సముద్రం, క్రీడాకారులు వీరేంద్ర, అప్పన్న, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన పార్టీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రోహిత్ వర్మ, పార్టీ నాయకుడు వెంకన్నాయుడు



మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను సత్కరిస్తున్న పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అమలాపురం పార్టీ నియోజవకర్గ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు ఆధ్వర్యంలో ఇటీవల పదవులు చేపట్టిన నాయకులు జగన్‌ను కలిశారు. ఆయనతో కొద్దిసేపు మాట్లాడారు. ఇటీవల పార్టీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన పట్టణానికి చెందిన దంతూలూరి రోహిత్ వర్మ కూడా జగన్‌ను కలిశారు. రోహిత్ వర్మ నాలుగు నెలల కిందట కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్‌లకు ఆయనపై అమలాపురం, ప్రకాశం జిల్లా దర్శి పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టి వేధించిన విషయంపై జగన్ మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజల తరపున పోరాటంలో యువత, సోషల్ మీడియా ముందు ఉండాలని జగన్ తమకు సూచించారని చెప్పారు. వారికి పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. వెంకన్నాయుడు, రోహిత్ వర్మతో పాటు నియోజకవర్గానికి చెందిన పార్టీ జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి గొల్లపల్లి బాబి, అమలాపురం సోషల్ మీడియా పార్టీ కో కన్వీనర్ సాకా నాని, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పాలమూరి ప్రవీణ్, అల్లవరం మండల పార్టీ నాయకుడు పెచ్చెట్టి బాబ్జి మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను అమలాపురానికి చెందిన పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిశారు. పార్టీకి చెందిన రాష్ట్ర ముస్లిం నాయకులు మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భంగా ఖాదర్ ఆయనను సత్కరించారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గవర్నమెంట్ యోగ ప్రొటోకాల్ ప్రకారం విజయవంతంగా నిర్వహించాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఎంఈఓలను జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి యోగాంధ్ర నిర్వహణ తల్లికి వందనం, కార్యక్రమాలపై మండల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు కమ్యూనిటీ హాలు స్టేడియంలు బహిరంగ ప్రదేశాలలో సుమారు 4500 వేదికలను గుర్తించి ఎనిమిది లక్షల మందితో ఈనెల 21వ తేదీన కామన్ యోగ ప్రొటోకాల్ 45 నిమిషాల పాటు నిర్వహించాలని ఆదేశించారు. దీనికి ముందుగా వేదికల గుర్తింపు, విద్యార్థులు తదితర జనాభా నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేసి 18, 19, 20 తేదీలలో శిక్షణ ట్రయిల్ రన్ నిర్వహించి ఈనెల 21న దిగ్విజయంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈఓలు కీలక పాత్ర పోషించాలన్నారు. 1 నుంచి 12 తరగతులు పాల్గొన్నాలని, ఈ శిక్షణ మూడు రోజుల పాటు నిర్వహించాలని, పాల్గొన్న వారికి విద్యాశాఖ ప్రశంసా పత్రాన్ని అందించాలన్నారు.

తల్లికి వందనం కార్యక్రమానికి సంబంధించి ఈ కేవైసీ పెండింగ్ సమస్యలు 2,453 వరకు ఉన్నాయని, తల్లులు చనిపోయిన వారి సంఖ్య 260 వరకూ ఉందని చిన్నారుల చనిపోయిన సంఖ్య జిల్లాలో 24 వరకు ఉందని, ఎన్పీసీఐ మ్యాపింగ్ పెండింగ్ అంశాలపై క్షేత్రస్థాయిలో నిజ నిర్ధారణ చేసుకొని అప్లోడ్ చేస్తూ అర్హులకు న్యాయం చేకూర్చాలని ఆయన ఆదేశించారు. 9 అంచెల విద్యా వ్యవస్థల ఏర్పాటుపై సమీక్షిస్తూ పాఠశాలలకు దూరంగా ఉన్న సుమారు 800 మంది విద్యార్థులు ట్రావెలింగ్ అలవెన్సులు పొందే వెసులుబాటు ఉందన్నారు. సచివాల య సిబ్బంది బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాజకుమారి జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తొలిత పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణ తీరుపై జిల్లా కలెక్టర్లకు దిశ నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ పండుగ వాతావరణంలో యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఇంజినీరింగ్ కళాశాలలు ఆట స్థలాలు, గ్రామ వార్డు సచివాలయాలు బహిరంగ ప్రదేశాలు, కమ్యూనిటీ హాళ్లు, క్రీడా ప్రాంగణాలను ఇప్పటి వరకు 4500 వరకూ గుర్తించామని, వీటిలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాజకుమారి ఏవో కాశీ విశ్వేశ్వరరావు, డీఈవో షేక్ సలీం భాష, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మమ్మీ తదితరులు పాల్గొన్నారు.

30న విద్యుత్ జేఈల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

యానాం: విద్యుత్ శాఖలో జూనియర్ ఇంజినీరు పోస్టులకు రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈనెల 30వ తేదీన నిర్వహించనున్నట్టు పుదుచ్చేరి విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు రాజేష్‌సన్యాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుదుచ్చేరి విద్యుత్ శాఖ కార్యాలయం 3వ ఫ్లోర్, కాన్ఫరెన్స్ హాలులో ఉద యం 10 గంటల నుంచి అభ్యర్థులను సర్టిఫికెట్లను పరిశీలిస్తారన్నారు. అభ్యర్థులు తమ వెంట పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, నివాస, నేటివిటీ, కుల, రేషన్‌కార్డు, ఆధార్ తదితర ధృవీకరణ పత్రాలను తెచ్చుకోవాలని సూచించారు.

ఉప్పు నీటితో పంటలు నష్ట పోతున్నామని ఫిర్యాదు

అమలాపురం రూరల్: మేజర్ డ్రైన్ ద్వారా సముద్రపు ఉప్పు నీరు ప్రవహించడం వల్ల పంటలను నష్టపోతున్నామని రైతులు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ మేజర్ డ్రైన్ నుంచి పంట కాలువలు, చిన్న కాలువల్లో సముద్రపు ఉప్పు నీరు ప్రవహించడంతో పంటలు పాడైపోతున్నాయని, సంవత్సరానికి ఒకే ఒక్క పంటకు పరిమితమవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.ఉప్పలగుప్తం మండలంలో ముంపు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రెండు మేజర్ డ్రైన్లు కలిసే ప్రదేశంలో కూనవరం వద్ద ఆటోమేటిక్ రెగ్యులేటరీ సిస్టమ్‌తో పవర్ లిఫ్ట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. డ్రైన్లలో పూడిక తొలగించాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మోటూరి రవి, నల్లా బాపండి, చిక్కం పెద్దబ్బులు, నల్లా సత్యనారాయణ, రాజులపూడి భీముడు, బండారు వెంకటేశ్వరరావు, రవణం మధు, అడబాల సత్యనారాయణ, మంచం బాలకృష్ణ, ఆకేటి వెంకన్న, గొల్లకోటి వెంకటేష్, వెంకటకృష్ణ చిక్కం, బిక్కిన ఏసు, సలాది తాతారావు, తాళ్ల రవి, పెయ్యల దుర్గారావు, దున్నాల దుర్గ, మారిశెట్టి రమేష్, నాగులపల్లి పరశురాం తదితరులు ఉన్నారు.

పేద మహిళపై జరిగిన దాడికి సీఎం బాధ్యత వహించాలి

అమలాపురం టౌన్: సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గంలో ఓ పేద మహిళపై అనాగరికంగా జరిగిన దాడికి సీఎం చంద్రబాబే పూర్తి బాధ్యత వహించాలని అమలాపురం నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు డిమాండ్ చేశారు. అమలాపురంలో ఆయన మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆ మహిళపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పేద మహిళ శిరీషను బాకీ విషయమై చెట్టుకు కట్టేసి మరీ దాడికి పాల్పడడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు శిరీష కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం, రెండు ఎకరాల సాగుభూమి ఇవ్వాలని మోహన్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం సొంత నియోజర్గంలోనే పేద మహిళలకు రక్షణ ఇంత దారుణంగా ఉంటే రాష్ట్రంలో మిగిలిన చోట్ల బాలికలు, మహిళల పరిస్థితి ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. అలాగే శిరీషపై దాడి చేసిన నిందితులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని మోహన్‌బాబు డిమాండ్ చేశారు.

పట్టణంలో కమిషనర్ పర్యటన

వాటర్ వర్క్స్, డంపింగ్ యార్డ్ పరిశీలన



నడిపూడి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నిర్మల్ కుమార్, ఇంజనీర్లు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వి.నిర్మల్‌కుమార్ పట్టణంలో పలు విభాగాల పనితీరును క్షేత్ర స్థాయిలో మంగళవారం సందర్శించి పరిశీలించారు. తాగునీటిని సాంకేతికంగా శుద్ధి చేసే వాటర్ వర్క్స్ విభాగాన్ని, మున్సిపాలిటీకి రా వాటర్ రిజర్వాయరు నడిపూడిలోని 44 ఎకరాల తాగునీటి చెరువు, డంపింగ్ యార్డ్ తదితర ప్రాంతాల్లో కమిషన్ నిర్మల్ కుమార్ ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ముఖ్యంగా మున్సిపాలిటీకి ఉన్న మూడు రిజర్వాయర్ల (చెరువులు) లోకి పంట కాలువల నుంచి సరఫరా అయ్యే నీటిని రా వాటర్‌గా త్వరితగతిన నింపాలని ఆదేశించారు. అలాగే చెత్తను తరలించి డంపింగ్ యార్డ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్ పార్కులు, ఇప్పటికే వాడుకలో ఉన్న ఈదరపల్లి– నల్ల వంతెన బైపాస్ రోడ్డుతో పాటు ఇటీవల నిర్మాణాలు పూర్తయిన కొత్త బైపాస్ రోడ్లను ఆయన తనిఖీ చేశారు. పట్టణంలో ఉన్న చెత్త నుంచి సంపద సృష్టించే రీ సైక్లింగ్ యూనిట్‌ను కూడా సందర్శించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారుల పరంగా ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాను ఈ మూడు విభాగాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బంది లేని సేవలు అందించనున్నట్టు కమిషనర్ ఆయా విభాగాల అధికారులకు వివరించారు. కమిషనర్ కూడా విభాగాల అధికారుల నుంచి పట్టణ సమస్యలు, అభివృద్ధి తదితర అంశాలపై వివరాలు సేకరించారు. ఈ క్షేత్ర స్థాయి పర్యటనలో కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్లు సూర్య భాస్కరరావు, వెంకటేష్, పట్టణ ప్రణాళిక అధికారి బి.రాణి సంయుక్త తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల ఎన్నిక

అమలాపురం రూరల్: అమలాపురం మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ ఆదేశాల జిల్లా ఇన్‌చార్జి కె.బి మధు మాదిగ, జిల్లా సహాయక ఇన్‌చార్జి సూరి మాదిగ, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సవరపు భైరవ మూర్తి సారథ్యంలో ఆకుమర్తి రమేష్ అధ్యక్షతన కమిటీ ఎన్నికలు మంగళవారం జరిగాయి. నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా మంద రామకృష్ణ మాదిగ, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా చుట్టుగుళ్ళ వీర వెంకట సత్యనారాయణ మాదిగ, యువసేన మండల అధ్యక్షుడిగా ఈతకోట మణికంఠ మాదిగ ఎన్నికున్నారు. కోనసీమ జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్‌అధ్యక్షుడు ఆకుమర్తి మోహన్ మాదిగ, జిల్లా ప్రచార కార్యదర్శి లంక రామకృష్ణ, ఉప్పలగుప్త మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సత్తాల దుర్గారావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. నూతన కమిటీలను నాయకులు అభినందించారు.

15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలి

తాళ్లరేవు: గ్రామ పంచాయతీలకు 2024–25 సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే బదిలీ చేయాలని సీపీఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రం ఐదు నెలల కిందట రెండో విడత ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.1121 కోట్లు రాష్ట్రానికి విడుదల చేసిందని, కానీ వాటిని పంచాయతీలకు బదిలీ చేయడం లేదన్నారు. దీనివల్ల పంచాయతీల అభివృద్ధి నిలిచిపోయిందని, పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. అంబాసిడర్‌లకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. తక్షణమే నిధులు బదలాయించాలని ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

తాళ్లరేవు: ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమం ద్వారా ఎంతో కాలంగా ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయని తహసీల్దార్ పితాని త్రినాథరావు తెలిపారు. మంగళవారం కోరంగి పంచాయతీలో రీసర్వే గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరంగి పంచాయతీలో దాదాపు రీసర్వే పూర్తయ్యిందని తెలిపారు. రైతులకు ఎవరికైనా ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెయ్యల మంగేష్, రీసర్వే డీటీ వీరబాబు, నాయకులు టి.లక్ష్మణరావు, పి.రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బ్రహ్మానందనగర్‌లో సౌకర్యాల కల్పనకు నిధుల మంజూరు



ఎమ్మెల్యేఅశోక్‌ను కలిసినబ్రహ్మానందనగర్ గ్రామస్తులు

యానాం: పట్టణ పరిధిలో బ్రహ్మానందనగర్‌లో రోడ్లు, డ్రైన్లు తదితర మౌలిక సౌకర్యాల కల్పనకు ఎంపీ నిధులు రూ.54 లక్షలు మంజూరు చేసినట్లు మంగళవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. గత కొన్నేళ్లుగా బ్రహ్మానందనగర్‌లో సౌకర్యాలు లేక తామంతా వర్షాల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మురుగునీరు శివారుకు వెళ్లడం లేదని తదితర సమస్యలు గురించి స్థానికులు ఎమ్మెల్యే అశోక్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన తక్షణం నిధులు మంజూరుతో పాటు బుధవారం పనులకు భూమి పూజ చేయనున్నట్టు ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యే అశోక్‌కు ఆ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సదుపాయాలు

యానాం: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సదుపాయాలు ఉన్నాయని, దీనివల్ల ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల మధ్య పోటీ నెలకొందని ఎల్జీ కె.కైలాషనాథన్ పేర్కొన్నారు. మంగళవారం పుదుచ్చేరి ఇందిరాగాంధీ ప్రభుత్వ మెడికల్ కళాశాల, పీజీ సెంటర్‌లో రూ.20 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ, సిటీస్కాన్ తదితర సదుపాయాలను సీఎం రంగసామితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు, నిపుణులైన వైద్య సిబ్బంది ఉంటారని అయినప్పటికీ ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల మధ్య పోటీ ఉంటుందన్నారు. సీఎం రంగసామి మాట్లాడుతూ లక్షలాది రూపాయిల ఖర్చుతో చెన్నై వంటి పెద్ద ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుని అక్కడ నయమవక తిరిగి జిప్‌మెర్, ప్రభుత్వ ఆసుపత్రుల వద్దకు వస్తున్నారన్నారు.

సూపరింటిండెంట్ వెంకటేశ్వరరావుకు బదిలీ

ముమ్మిడివరం: స్థానిక సమగ్ర శిక్షా కార్యాలయం సూపరింటిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. ఆయన ఎఫ్ఎస్‌టీపై విధులు నిర్వహిస్తున్న ముమ్మిడివరం డీఈఓ కార్యాలయానికి సూపరింటిండెంట్‌గా వెళ్లారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును విధుల నుంచి ఏపీసీ మమ్మీ రిలీవ్ చేస్తూ, ఆయన సేవలను ప్రశంసించారు. అనంతరం ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏవో బీవీవీఎస్ రంగారావు, జేఏఓ ప్రవీణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.